క్లుప్తంగా

పాఠశాలకు వాటర్ ఫిల్టర్ అందజేత

మరికల్: మండలంలోని గాజులయ్య తండా ప్రాథమిక పాఠశాలకు అదే పాఠశాలలో పని చేసే ఉపాధ్యాయుడు నవీన్‌కుమార్ వాటర్ ఫిల్టర్ అందజేశారు. బుధవారం హెచ్‌ఎం లక్ష్మయ్యకు వాటర్ ఫిల్టర్‌ను అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం లక్ష్మయ్య మాట్లాడుతూ విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలనే ఉద్దేశంతో వాటర్ ఫిల్టర్‌ను అందజేయడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం ఉపాధ్యాయుడు నవీన్‌కుమార్‌ను అభినందించారు.

పారిశుద్ధ్య పనులు చేపట్టాలి

కోస్గి రూరల్: ఈ నెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని మున్సిపల్ వాకర్స్ క్లబ్ అసోసియేషన్ నాయకులు కోరారు. ఈ మేరకు బుధవారం కమిషనర్ నాగరాజుకు వినతిపత్రం అందజేశారు.అలాగే యోగా దినోత్సవంలో అందరు భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో వాకర్స్ సభ్యులు బాలకృష్ణ , జైపాల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

భూ భారతి దరఖాస్తుల పరిశీలన

కొత్తపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ భారతి రెవన్యూ సదస్సుల్లో భాగంగా ఈ నెల 3వ తేది నుంచి మండలంలోని ప్రతి గ్రామంలో భూసమస్యలపై ఇచ్చిన దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు చేపట్టినట్లు తహసీల్దార్ జయరాములు తెలిపారు. దరఖాస్తుల స్వీకరణలో భాగంగా ఇప్పటి వరకు 197 అర్జీలు వచ్చినట్లు పేర్కొన్నారు. మండలంలోని అల్లిపూర్, తిమ్మారెడ్డి పల్లి, మన్నాపూర్, పెద్దాపూర్ గ్రామాలో దరఖాస్తులు సమర్పించిన వారికి నోటీసులు అందజేసి వారం రోజుల్లో క్షేత్ర స్థాయిలో పరిశీలించి ఫిర్యాదుదారులకు న్యాయం చేస్తామన్నారు.

మధ్యవర్తులను సంప్రదించవద్దు

కోస్గిరూరల్: తెలంగాణ ప్రభుత్వం అందించే ఆర్థిక సాయం మంజూరు, ధ్రువీకరణ పత్రాల మంజూరు విషయంలో బ్రోకర్లను , మధ్యవర్తులను సంప్రదించవద్దని మండల తహసీల్దార్ బక్క శ్రీనివాసులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్త రేషన్ కార్డులు , కల్యాణలక్ష్మి , షాదిముబారక్ ఆర్థిక సాయం మంజూరు ధృవపత్రాల విషయంలో బ్రోకర్లను, మధ్యవర్తులను కలవొద్దని నేరుగా కార్యాలయంలో సంప్రదించాలన్నారు. ఎవరైనా డబ్బులు డిమాండ్ చేస్తే తమకు ఫిర్యాదు చేయాలని సూచించారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి

కోస్గి రూరల్: సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని మండల తహసీల్దార్ బక్క శ్రీనివాసులు, ఎంపీడీఓ శ్రీధర్ అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ మలేరియాతో వ్యాధితో అప్రమత్తంగా ఉండాలని , 0–5 ఏళ్లలోపు పిల్లల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. కాచివడ బోసిన నీటిని తాగాలని సూచించారు.

పేదల సొంతింటి కల కాంగ్రెస్‌తోనే సాకారం

నారాయణపేట రూరల్: రాష్ట్రంలో పేద ప్రజల సొంతింటి కలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేరుస్తుందని మార్కెట్ కమిటీ చైర్మన్ రాంపురం సదాశివరెడ్డి అన్నారు. మండలంలోని భైరంకొండ, జలాల్ పూర్ గ్రామాల్లో పలువురికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా నిర్మాణానికి బుధవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇస్తామని మోసం చేసిందన్నారు. మిగులు రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిందని విమర్శించారు.

ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ

దామరగిద్ద: పేద వారి సొంతింటి కలను నేరవేర్చుకునేందుకు ఇందిరమ్మ ఇళ్ల పథకం పేదలకు వరం లాంటిందని కాంగ్రెస్ నాయకులు మహిపాల్‌రెడ్డి, సాయిరెడ్డి, నింగప్పలు అన్నారు. బుధవారం మండలంలోని మద్దెల్‌బీడ్ గ్రామంలో పంచాయతీ కార్యదర్శి మంజుల, హౌసింగ్ ఏఈ సమక్షంలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులకు ఇంటి నిర్మాణానికి ప్లాన్ అందజేసి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు రాములు, నర్సప్ప, వెంకటప్ప లు పాల్గొన్నారు.

ఇసుక రీచ్ తనిఖీ

మాగనూర్: మండల పరిధిలోని అడవిసత్యావార్ గ్రామశివారులోని ఇసుక రీచ్‌ను తహసీల్దార్ నాగలక్ష్మి తనిఖీ చేశారు. ఇసుక రీచ్ నుంచి అధిక లోడ్‌తో వాహనాలు వెళ్తున్నట్లు ఫిర్యాదు అందడంతో తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు. నిబంధనలు పాటించాలని, వాహనాల డ్రైవర్లు జనావాస ప్రాంతాల్లో వెళ్లేటప్పుడు జాగ్రత్తగా వెళ్లాలని సూచించారు.

వర్షాకాలం జర జాగ్రత్త..!

- విద్యుత్ వైర్లను సరి చేసుకోవాలి
- సమస్యలు ఉంటే అధికారులకు ఫిర్యాదు చేయాలి
- జాగ్రత్తలతోనే ప్రమాదాల నివారణ



విద్యుత్ స్తంభాలకు మరమ్మతు చేస్తున్న సిబ్బంది (ఫైల్)

మాగనూర్: ఆరుగాలం కష్టపడి పంటను పండించే రైతన్నలు వర్షాకాలంలో జాగ్రత్తగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. వానాకాలం ప్రారంభం కావడంతో పంటల సాగుకు అన్నదాతలు సన్నద్ధం అవుతున్నారు. ఈ క్రమంలో విద్యుత్ స్తంభాలు ఉన్న చోట యంత్రాలతో దుక్కిదున్నే క్రమంలో పొరపాటున స్తంభాలను తాకినట్లయితే ప్రమాదాలు జరగవచ్చు. అలాగే పంట చేలలోని విద్యుత్ మోటార్ల విద్యుత్ తీగలు కింద వేలాడినట్లు కనిపిస్తే సంబంధిత అధికారులకు సమాచారం అందించి విద్యుత్ తీగలను సరి చేసిన తరువాతనే పంటల సాగు చేయాలని విద్యుత్ అధికారులు కోరుతున్నారు. పంట చేలల్లో విద్యుత్ వైర్లు కిందకు వేలాడుతున్న అధికారులకు ఫిర్యాదు చేసి సాగుకు సన్నద్ధమవడం మంచిదని పేర్కొన్నారు.

విద్యుత్ మోటార్లు బిగించే క్రమంలో ..

పంటల సాగు చేసే ప్రతి రైతు వేసవిలో మోటార్లను తీసేసి వర్షాలు పడే సమయంలో మళ్లీ విద్యుత్ మోటార్లను అమర్చే క్రమంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద సొంతంగా మరమ్మతులు చేస్తుంటారు. దీంతో విద్యుత్ మోటార్లు కాలిపోయే ప్రమాదం ఉందని అధికారులు చెబుతున్నారు. కావున రైతులు సొంతంగా మరమ్మతులు చేసుకోవద్దని విద్యుత్ అధికారులను సంప్రదిస్తే మోటార్లకు విద్యుత్ అందించి సాగుకు సిద్ధం చేస్తారు. ప్రతి రైతు వ్యవసాయ మోటారుకు నాణ్యమైన విద్యుత్ వైరును వాడి అలాగే స్టార్టర్లను సురక్షితంగా ఉండే ప్రదేశంలో అమర్చాలి. పంట చేలలో మోటారు చుట్టూ పచ్చ గడ్డి నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. రైతులు స్టార్టర్లను కింద పెట్టేస్తుంటారు. వాటికి సరైన రక్షణ కవచం లేకపోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశం లేకపోలేదు.

పంటల రక్షణకు విద్యుత్‌ను వాడొద్దు..

పంటలు చేతికొచ్చే సమయంలో కొంత మంది రైతులు పంట చుట్టూ ఇనుప వైర్‌ను ఏర్పాటు చేసి దానిని విద్యుత్‌కు అనుసంధానం చేస్తారు. దీని వల్ల జంతువుల బారి నుంచి పంటలు కాపాడుకోవచ్చని ఇలా చేస్తుంటారు. కానీ అది చాలా ప్రమాదకరమని , ఇదే సమయంలో రైతులు కూడా ప్రమాదం బారిన పడే అవకాశం ఉంది. ప్రతి రైతు పంట చేలో విద్యుత్ జాగ్రత్తలు పాటిస్తూ పంటలు పండించాలని అధికారులు సూచిస్తున్నారు.



వ్యవసాయ పనుల్లో మహిళా కూలీలు

అవగాహన కల్పించాలి..



పంట పొలాల్లో విద్యుత్ వినియోగంపై రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించాలి. వర్షాకాలంలో విద్యుదాఘాతానికి గురై ప్రాణాలు కోల్పోతున్నారు. రైతులు వినియోగించే మోటార్లు సక్రమంగా ఉన్నాయో లేదో పరిశీలించి అప్రమత్తంగా ఉండాలి. లేకుంటే ప్రమాదాల బారిన పడే అవకాశం ఉంది.

– శేఖర్, యువరైతు, గురువలింగంపల్లి

అధికారులను సంప్రదించాలి



రెతులు వర్షాకాలం నేపథ్యంలో సొంతంగా మరమ్మతులు చేసుకోకుండా సంబంధిత విద్యుత్ శాఖ అధికారులను సంప్రదించాలి. లేకపోతే ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. రైతులు చేసే చిన్నపాటి పొరపాటుతో ప్రాణం పోయే అవకాశం ఉంది.

– గంగాధర్, విద్యుత్ ఏఈ, మాగనూర్

బీటీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ



రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న విక్రంరెడ్డి

కోస్గి రూరల్: గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకే బీటీ రోడ్డు నిర్మాణలను చేపడుతున్నామని గుండుమాల్ మండల అధ్యక్షుడు విక్రంరెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని పెద్ద తండా గ్రామపంచాయతీ పరిధిలో దాడి తండాకు బీటి రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఎస్‌డీఎఫ్ నుంచి రూ.94 లక్షల నిధులు మంజూరు కావడంతో రోడ్డు నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. ప్రభుత్వం అన్ని వర్గాలకు న్యాయం చేయడమే ధ్యేయంగా సంక్షేమపథకాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ ప్రకాష్ రెడ్డి , మాజీ ఎంపీపీ మధుకర్‌రావు పలువురు నాయకులు పాల్గొన్నారు.

పైపులైన్ నిర్మాణ పనులు ప్రారంభం

నర్వ: మండలంలోని జంగారెడ్డిపల్లిలో వాటర్ ట్యాంకు పైప్‌లైన్ పనులను ఎంపీడీఓ శ్రీనువాసులు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రూ.1.40 లక్షలతో పాత ట్యాంకు నుంచి నూతనంగా నిర్మించిన ట్యాంకు వరకు పైపులైన్ పనులు చేపట్టనున్నారు. ఈ పైప్‌లైన్ పనులను మంత్రి వాకిటి శ్రీహరి ఆదేశాల మేరకు ప్రారంభించినట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చెన్నయ్యసాగర్ తెలిపారు. కార్యక్రమంలో ఏఈ ఫకీరన్న, పంచాయతీ కార్యదర్శి విష్ణు, మండల కాంగ్రెస్ నాయకులు శరణప్ప, రవీందర్‌రెడ్డి, రాజారెడ్డి, సద్దలి ఆంజనేయరెడ్డి, అశోక్‌గౌడ్, నర్సింహా పాల్గొన్నారు.

రైతులు వివరాలు అందించాలి

కోస్గి రూరల్: ప్రభుత్వం అందిస్తున్న రైతు భరోసా పెట్టుబడి సాయం కోసం బ్యాంకు ఖాతాల వివరాలు అందించని రైతులు ఈ నెల 20వ తేదీలోగా అందించాలని మండల వ్యవసాయాధికారి రామకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలో 13,331 మంది రైతులకు గాను 11,999 మంది రైతులు తమ బ్యాంకు ఖాతాల వివరాలను వ్యవసాయ శాఖ అధికారులకు సమర్పించారన్నారు. అందులో 9191 మంది రైతులకు గాను రూ.6,92,27,941 రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. మిగిలిన 1332 మంది రైతులు తమ త్వరితగతిన బ్యాంకు ఖాతాలకు సంబంధించిన వివరాలను అందించి రైతు భరోసా పెట్టుబడి సాయం పొందాలని కోరారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం



మక్తల్‌లో పరిసరాల శుభ్రతపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది



కోస్గిలో తడి-పొడి చెత్తపై అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ కమిషనర్ నాగరాజు

కోస్గి రూరల్: ఇంటి పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యంగా జీవించవచ్చని మున్సిపల్ కమిషనర్ నాగరాజు అన్నారు. 100 రోజుల కార్యాచరణలో భాగంగా బుధవారం పట్టణంలోని 2వ వార్డులో తడి-పొడి చెత్తపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తడి , పొడి చెత్తను వేరు వేరు బుట్టలలో వేయాలని, తడి చెత్త నుంచి ఎరువులు తయారు చేయవచ్చన్నారు. వస్తువుల వినియోగానికి ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి బట్ట సంచులను వాడాలన్నారు. అలాగే అమృత్‌జల్ పథకం ద్వారా త్వరలోనే ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో మేనేజర్ అనిల్‌కుమార్ , హెల్త్ అసిస్టెంట్ మోహిన్‌బాషా, మున్సిపల్ అధికారులు, మెప్మా సిబ్బంది, కార్మికులు ఉన్నారు.

కలుషిత నీటితో విషజ్వరాలు

ఊట్కూరు: మండలంలోని అన్ని గ్రామాలలో పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కలిపిద్దామని ఎంపీడీఓ ధనుంజయ్యాగౌడ్ అన్నారు. బుధవారం ఊట్కూరు ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్ సంతోషి అధ్యక్షతన మండల టాస్క్‌ఫోర్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో కలుషిత నీరు తాగడం వల్ల విషజ్వరాలు సోకుతాయన్నారు. గ్రామాలలో నీటి కొళాయిలు ఉన్నచోట గుంతలు లేకుండా చూడాలని పైపులైన్ లీకేజీలను పరిశీలించి ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. గ్రామపంచాయితీ సిబ్బంది, వైద్య సిబ్బంది కలిసి గ్రామాలలో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.

ప్లాస్టిక్‌ను నిషేధించాలి

మక్తల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 100 రోజుల ప్రణాళికలో భాగంగా మక్తల్‌లోని 2వ వార్డులో పరిసరాల శుభ్రతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ శంకర్ నాయక్ మాట్లాడుతూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడరాదని సూచించారు. వాటర్ ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలని, తడి, పొడి చెత్తను వేరుచేసి సిబ్బందికి అందజేయాలన్నారు. అలాగే సీజనల్ వ్యాధులు రాకుండా పడుకునుముందు దోమతెరలు వాడాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, కాలనీవాసులు పాల్గొన్నారు.

డయేరియా నివారణకు కృషి చేద్దాం

దామరగిద్ద: వానాకాలంలో డయేరియా బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యాధికారి సుదేష్ణ, ఎంఈఓ కృష్ణారెడ్డిలు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మండల స్థాయి టాస్క్‌ఫోర్సు కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 31 వరకు ఆరోగ్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి చిన్నారులు ఉన్న ఇళ్లల్లో ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, జింక్ మాత్రలు అందజేసి పరిశుభ్రత చర్యలపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్, జీఎచ్‌ఓ నారాయణ, హెల్త్ సూపర్‌వైజర్ వెంకటేశ్ అంగన్‌వాడి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతు భరోసా నిధుల విడుదల

మరికల్: అన్నదాతలకు పెట్టుబడి సాయం కింద రైతు భరోసాకు సంబంధించి మండల వాప్తంగా 9,841 మంది రైతుల ఖాతాల్లో రూ. 7.75 కోట్లను ప్రభుత్వం జమ చేసిందని మరికల్ ఏఈఓ పరుశురామ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే కొత్తగా పట్టాదారు పాసు పుస్తకాలు పొందిన వారు ఈనెల 20వ తేదీలోపు రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సంబంధిత గ్రామాల ఏఈఓలకు దరఖాస్తులు అందజేయాలని సూచించారు.

7537 మంది రైతులకు పెట్టుబడి సాయం

కొత్తపల్లి: మండలంలోని 7537 మంది రైతులకు వానాకాలం రైతు భరోసా పెట్టుబడి సాయంగా మండలంలోని 5372 మంది రైతుల ఖాతాల్లో రూ.4,35,86,783 జమ చేసినట్లు ఏఓ రమేశ్ తెలిపారు. మిగిలిన వారి ఖాతాలలో కూడా నగదు బదిలీ కొనసాగుతుందని, ఇంకా మండలంలోని 446 మంది రైతులు తమ బ్యాంకు ఖాతాలను సమర్పించాలసి ఉందన్నారు. ఈ నెల 20వ తేదీలోపు బ్యాంకు ఖాతా, రైతు పాసుబుక్, ఆధార్ కార్డును సమర్పించి రైతు భరోసా ద్వారా లబ్ధిని పొందాలని సూచించారు.

రూ.9 కోట్లు విడుదల

మద్దూరు: వానాకాలం సీజన్‌కు పెట్టుబడి సాయం కింది ప్రభుత్వం మద్దూరు మండలంలోని 11,626 మంది రైతుల ఖాతాల్లో రూ.9,04,64,315 జమ చేసినట్లు ఇన్‌చార్జి మండల వ్యవసాయాధికారి రామకృష్ణ తెలిపారు. మద్దూరు మండలంలో 16,443 మంది రైతులకు గాను 15,075 మంది రైతులు బ్యాంకు ఖాతాల వివరాలను వ్యవసాయ శాఖకు అందజేయగా 1368 మంది రైతులు తమ బ్యాంకు ఖాతా వివరాలను అందజేయాల్సి ఉందన్నారు. వీరు కూడా ఈనెల 20లోపు వివరాలను సంబంధిత ఏఈఓలక అందజేయాలని సూచించారు. వివరాలు అందజేసిన రైతులకు నగదు బదిలీ కొనసాగుతుందని పేర్కొన్నారు.

ఎమ్మెల్సీ చేతుల మీదుగా ప్రశంసాపత్రం



ఊట్కూరు: ఊట్కూరు గురుకుల పాఠశాలలో పదో తరగతిలో ప్రతిభ కనబర్చిన ఊట్కూరు గ్రామానికి చెందిన తలారి నరహరిగౌడ్ కూతురు హారిక అనే విద్యార్థినికి బుధవారం పీఆర్‌టీయూ ఎమ్మెల్సీ పింగలి శ్రీపాల్‌రెడ్డి, కలెక్టర్ సిక్తాపట్నాయక్ చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందజేశారు. హారికా 600 మార్కులకు గాను 545 మార్కులు సాధించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా నాయకులు జనార్ధన్‌రెడ్డి, సూపర్‌వైజర్ గీత, జగదీశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మాయిలను వేధిస్తే చర్యలు తప్పవు

కోస్గి రూరల్: అమ్మాయిలను వేధింపులకు గురిచేస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని షీ టీం పోలీసులు బాలరాజు, జ్యోతి హెచ్చరించారు. ఎస్పీ యోగేష్ గౌతం ఆదేశాల మేరకు బుధవారం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు వేధింపులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈవ్ టీజింగ్, ర్యాగింగ్, బ్లాక్ మెయిల్, సోషల్ మీడియాలో అసభ్యకర కామెంట్స్ చేస్తే సహించేదిలేదన్నారు. ఎవరైనా వేధింపులకు గురిచేస్తే షీటీం పోలీసులను ధైర్యంగా సంప్రదించాలని విద్యార్థినులకు సూచించారు.

శివాలయం నిర్మాణానికి విరాళం

ధన్వాడ: మండలంలోని గున్ముక్ల గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న శివాలయ నిర్మాణానికి ముదిరాజ్ సంఘం సభ్యులు రూ. 3,01,116 విరాళం అందజేశారు. బుధవారం ఆలయ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డిని కలిసి నగదు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ ముదిరాజ్ సంఘం తరపున దేవాలయ నిర్మాణానికి సహకారం అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు నరసింహారెడ్డి, బాలయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నూతన లిఫ్ట్ కమిటీ ఎన్నిక

మాగనూర్: మండల పరిధిలోని కొల్పూర్ గ్రామంలో గల ముడుమాల ఎత్తిపోతల పథకం–బికు సంబంధించి నూతన కమిటీని బుధవారం ఐదు గ్రామాల రైతులు ఎనుకున్నారు. అధ్యక్షుడిగా కమరి వెంకటేశ్, ఉపాధ్యక్షుడుగా గోపాల్‌రెడ్డి, సెక్రటరీగా మారుతి అలాగే సభ్యులుగా రాజప్ప, మాల నర్సింములు, అంజప్ప, హరికృష్ణ, కుర్వ సాబెన్న, రవీంద్రగౌడ్, కుమ్మరి నింగప్ప, కుర్వ శంకరప్పతో నూతన కమిటీని ఎన్నుకున్నారు.

మంత్రి పర్యటనను విజయవంతం చేద్దాం



మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చెన్నయ్యసాగర్

నర్వ: మత్స్య, పాడిపరిశ్రమ, పశుసంవర్ధక శాఖ, క్రీడాయువజన మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత మొదటి సారి నర్వకు విచ్చేస్తున్న డా.వాకిటి శ్రీహరికి సాదర స్వాగతం పలుకుదామని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బీసం చెన్నయ్య సాగర్ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ..గురువారం ఉదయం 9 గంటలకు ఊరి బయటి ఆంజనేయస్వామి ఆలయంలో పూజా కార్యక్రమాలు నిర్వహించి అక్కడి నుంచి భారీ ర్యాలీగా ఎంపీడీఓ కార్యాలయం వరకు చేరుకుంటారన్నారు. అక్కడ ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రొసిడింగ్స్ పత్రాలు, కల్యాణలక్ష్మీ, షాది ముబారక్ చెక్కులను, సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేస్తారన్నారు. సమావేశంలో నాయకులు కృష్ణారెడ్డి, శరణప్ప, రవీందర్ రెడ్డి, సుధాకర్‌రెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, అశోక్‌గౌడ్, సంజీవరెడ్డి, సుదర్శన్‌గౌడ్, ఆంజనేయరెడ్డి, వెంకట్రామారెడ్డి, నర్సింహా తదితరులు పాల్గొన్నారు.

'స్థానిక ఎన్నికల్లో సత్తా చాటుదాం'



నూతన కార్యవర్గ సభ్యులను సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

నర్వ: రాష్ట్రంలో త్వరలో జరగనున్న స్థానిక ఎన్నికల్లో సత్తా చాటుదామని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బంగ్లా లక్ష్మీకాంత్‌రెడ్డి అన్నారు. బుధవారం నర్వలో బీజేపీ మండల అధ్యక్షుడు అజిత్ సింహారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అంతకు ముందు బీజేపీ మండల కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా లంకాల్ విజయ్‌రామ్, ఉపాధ్యాక్షులుగా గుండారెడ్డి, వెంకట్‌రెడ్డి, కోశాధికారిగా యాదవరెడ్డిని మరి కొందరిని కార్యవర్గ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బంగ్లా లక్ష్మీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. పాలమూరు ఎంపీ డీకే అరుణ సాయంతో మండలానికి రూ. 1.50 లక్షలు మంజూరు చేయించామన్నారు. ఈ నిధులతో మండలంలో 6 అంగన్‌వాడీ కేంద్రాలకు నూతన భవనాలు, ఒక్కో భవనానికి రూ.21 లక్షలు, నర్వ కేజీబీవీలో రూ.25 లక్షలతో డైనింగ్‌హాల్ నిర్మాణం, పాథర్చేడ్ ఉన్నత పాఠశాలలో సైన్స్ ల్యాబ్ ఏర్పాటుకు నిధులు మంజూరు చేశారన్నారు. త్వరలో ఈ పనులకు భూమి పూజ చేస్తామన్నారు. సమావేశంలో బీజేపీ నాయకులు రాష్ట్ర నాయకులు బంగ్లా లక్ష్మీకాంత్‌రెడ్డి, నియోజకవర్గ నాయకులు కర్నిస్వామి, బల్‌రాంరెడ్డి, లలితమ్మ, కుర్వసత్యం, అజిత్‌సింహారెడ్డి, జయానంద్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, విజయ్‌రామ్, తదితరులు పాల్గొన్నారు.

'అవినీతికి కేరాఫ్ అడ్రస్ కాంగ్రెస్, బీఆర్‌ఎస్'



సమావేశంలో మాట్లాడుతున్న ప్రదీప్

నారాయణపేట రూరల్: కాంగ్రెస్, బీఆర్‌ఎస్ అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా మారిన పార్టీలని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుద్యాల ప్రదీప్, రాష్ట్ర నాయకురాలు కంకణాల నివేదిత రెడ్డి అన్నారు. మోదీ 11 ఏళ్ల పాలనపై బుధవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. బీజేపీ అంటేనే అవినీతి రహిత శాంతియుత పాలన అని పేర్కొన్నారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో నారాయణపేట మున్సిపల్ పీఠం బీజేపీ పరం చేయాలని, అలాగే సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో జిల్లాలో అత్యధిక స్థానాలు గెలిచేలా నాయకులు, కార్యకర్తలకు కృషి చేయాలని సూచించారు. రాష్ట్ర నాయకులు నాగురావు నామాజీ, జిల్లా అధ్యక్షులు కొండా సత్యయాదవ్, పట్టణ అధ్యక్షులు పోషల్ వినోద్, కొండయ్య, లక్ష్మి శ్యాంసుందర్ గౌడ్, రఘురామయ్య గౌడ్, శ్రీనివాస్, రఘువీర్ యాదవ్, వెంకటయ్య, సాయిబన్న పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలపై అవగాహన

మద్దూరు: ఆపరేషన్ మెర్సీ ఇండియా ఫౌండేషన్(ఓఎంఐఎఫ్) అధ్వర్యంలో బుధవారం మద్దూరు పట్టణంలో జోగిని, ఒంటరి మహిళలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, హక్కులు, బాధ్యతలపై చైల్డ్ హెల్ప్‌లైన్, మహిళాసాధికరత సంస్థ అవగాహన కల్పించారు. అలాగే బాల్య వివాహాలతో కలిగే అనర్థాలు, లింగ సమానత్వం, ఆర్థిక అక్షరాస్యత సాధించడం ఏలా ? ప్రభుత్వం మహిళల కోసం తీసుకొచ్చిన చట్టాలు, సంక్షేమ పథకాల గురించి వివరించి సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సంస్థ మండల కోఆర్డినేటర్ కృష్ణ, చైల్డ్ హెల్ప్ లైన్ కోఆర్డినేటర్ నర్సింములు, జెండర్ స్పెషలిస్టు కవిత, బీపీఎం భాస్కర్, భరోసా సెంటర్ సపోర్టర్ పర్వన్‌దేవి, కానిస్టేబుల్ అపర్ణ, లాలమ్మ, స్వాతి, శారదమ్మ తదితరులు పాల్గొన్నారు.

కళాశాలలో సమస్యల పరిష్కారానికి కృషి



రాజ్‌కుమార్ రెడ్డికి జ్ఞాపిక అందజేస్తున్న ప్రిన్సిపల్ ఉమాయ్ ఆస్ర

ధన్వాడ: మండల కేంద్రంలోని ఆదర్శ జూనియర్ కళాశాలలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి తన వంతు సహకారం అందిస్తానని భీష్మరాజ్ ఫౌండేషన్ అధ్యక్షుడు రాజ్‌కుమార్ రెడ్డి అన్నారు. మంగళవారం పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో నెలకొన్న సమస్యలను ప్రిన్సిపల్ ఉమాయ్ ఆస్ర ఆయన దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన దశలవారీగా కళాశాలలో నెలకొన్న సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం పాఠశాల తరపున ప్రిన్సిపల్ ఆయనను శాలువా, జ్ఞాపిక బహుకరించి సత్కరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు మణిమాల, రమేష్‌గౌడ్, రామాంజనేయులు, ప్రసాద్, చంద్రశేఖర్, రామన్‌గౌడ్, రాజ్‌కుమార్, అఖిల్, సంతోష్ పాల్గొన్నారు.

ఎల్లమ్మ ఆలయంలో భీష్మ ఫౌండేషన్ చైర్మన్ పూజలు



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భీష్మ రాజ్ ఫౌండేషన్ చైర్మన్ నవీన్‌కుమార్

మరికల్: మండలంలోని తీలేర్ రేణుక ఎల్లమ్మ జాతర ఉత్సవాల్లో భాగంగా బుధవారం అమ్మవారికి భీష్మ రాజ్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ రాజ్ కుమార్ రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం రాజ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి తన వంతు సహకారం ఎప్పటికీ ఉంటుందన్నారు. కార్యక్రమంలో తిప్పన్న, హన్మంతు, సంతోష్, నర్సింహ నాయుడు, నందుకుమార్ పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి చేయూత

దామరగిద్ద: పాఠశాల అభివృద్ధికి భీష్మరాజ్ ఫౌండేషన్ తన వంతు సహకారం అందిస్తుందని ఫౌండేషన్ చైర్మన్ రాజ్‌కుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని ఉద్మల్‌గిద్ద ప్రాథమికోన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు, స్థానిక నాయకులు పాఠశాలకు పెయింటింగ్ వేయించడానికి సహకారం అందించాలని కోరారు. సానుకూలంగా స్పందించిన రాజ్‌కుమార్ రెడ్డి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మధుసూదన్‌రెడ్డి, హన్మంతు, నర్సింహనాయుడు, శివరాజ్ తదితరులు పాల్గొన్నారు.